# చీమ - గొల్లభామ

అనగా అనగా చీమ ఉంది.

ఆ చీమ వేసవి కాలమంతా అక్కడా యిక్కడా కష్టపడి, కావలసిన తినుబండారాలన్నీ సమకూర్చుకుని, శ్రావణ భాద్రపదాలు వచ్చేసరికల్లా, చీకూ చింతా లేకుండా తన ఇంట్లో తాను, మహారాజులా కూర్చుంది.

ఆ చీమకో స్నేహితురాలు ఉంది.

ఆ స్నేహితురాలి పేరు గొల్లభామ.

ఆ గొల్లభామ వయసు పోకిళ్ళు పోతూ, వేసవి కాలమంతా వో తీయని కలగా గడిపేసింది. వర్షాకాలం రావడంతోనే, గూడు సరిగా అమరక, కాలే కడుపుకు సమాధానం చెప్పుకోలేక, స్నేహితుడు చీమ దగ్గరకు వచ్చింది, సహాయం కోసమని.

"చీమా, చీమా, నాకీపూట కింత అన్నం పెట్టవ్?" అన్నది హీన స్వరంతో.

చీమకు గొల్లభామ స్థితి చూసి చీమ కుట్టినట్లైంది. "వేసవి కాలమంతా ఏం చేశావ్?" అన్నది మంద లింపుగా.

"ఏం చేశానా? పాటలు పాడాను. ఆటలాడాను. రాత్రింబవళ్ళు రంగు దారాలను వంటికి చుట్టుకుని పూల కన్నెల మధ్య నిల్చుని పూవిల్తుని రాచిలుక నైనాను."

"అలాగే ఉండలేక పోయినావ్?—కవిత్వం చెప్పు కుంటూ, పాటలు పాడుకుంటూ, కాలం గడపలేక పోయి నావ్?—ఈ చేదు బ్రతుకు నీ కెందుకు?"

ఈ కథలో చీమ గొల్లభామకు సహాయం చేసిందా లేదా అన్నది ముఖ్యంకాదు. చదువరుల సానుభూతి ఎవరి కన్నది ముఖ్యం. నా మటుకు నాకు గొల్లభామ అంటేనే ఎక్కువ సానుభూతి. ఇప్పుడు నే గడుపుతున్న చీమబ్రతుకు కన్నా, గొల్లభామలా ఒక్క రోజు తీయగా, కన్నులముందు స్వర్గఖండాన్ని నిలుపుకోగల్గితే?

కుక్కుటేశ్వర రావును కలుసుకున్నప్పుడల్లా నాకీ కథ జ్ఞాపకం వస్తుంది నిన్న సాయంత్రం అనుకోకుండా అతన్ని 'వసంత మహల్ లో కలుసుకున్నాను. మనిషంతా దిగాలు పడియున్నాడు. కన్నుల లోతుల్లోనుంచి ఏదో విచిత్రమైన భయం, వైరాగ్యం తొంగి చూస్తున్నాయి. కాఫీ కప్పు

ఎదురుగా బల్లమీద ఉండగానే, కిటికీలోనుండి బయటికి చూస్తూ కూచున్నాడు, గడ్డం క్రింద చెయి పెట్టుకుని. కాఫీ కప్పు చల్లారి పోతున్నది. అతని కళ్ళద్దాలు ముక్కు చివరకు రావటానికి ప్రయత్నం చేస్తున్నాయి.

అతన్ని చూడగానే అనుకున్నాను, అతని తమ్ముడేదో గొడవ తీసికొని వచ్చి ఉంటాడు, అని

అతని ఎదురుగా వెళ్ళి కూచుని, అతని బుజంమీద చెయి వేశాను. మనిషి ఉలిక్కి పడ్డాడు. "కులాసాగా ఉన్నావా?" అని అడిగాను.

నన్ను చూసి గుర్తు పట్టనట్టుగా పేలవంగా నవ్వాడు.

"ఆం! కులాసాగానే ఉన్నాను. ఏదో జరిగిపోతోంది కాలం."

"మీరేదో బాధపడుతున్నట్లున్నారు. మళ్ళీ మోహన్‌రావు వచ్చాడేమిటి?"

"ఆం! ఆం! వచ్చాడు. నా ప్రాణం తీయటానికి."

"అయినా నాకు తెలీక అడుగుతాను, మీరేనండీ, అతిగాడికి ఇంతగా చేతులూ కాళ్ళు ఇచ్చింది! పదేళ్ళు నిండని వాడుగా ఉన్నప్పుడు కదూ మీరు వాణ్ణి చేర దీసింది? సరియైన మందు సరియైన సమయంలో వేసివున్నట్లైతే, వాడిట్లా చెడిపోయి ఉండేవాడు కాడు."

నా మటుకు నా కనిపిస్తుంటుంది, మోహనరావు లాంటి ఆగమ్మ కాకులు ప్రతి కుటుంబంలో ఒకరో ఇద్దరో

ఉంటుంటారని. వాళ్ళను సాంప్రదాయమూ, కుటుంబ గౌరవం, ప్రేమ, పెళ్ళి, పిల్లలు ఇటువంటి చీకాకు కల్గించే వ్యవహారాలేవీ, ఒక గూటికి బంధించలేవు. స్వేచ్ఛ! ఉద్యోగంలో స్వేచ్ఛ, భార్యాబంధంనుంచి స్వేచ్ఛ, జీవన కఠోర నియమాలనుంచి స్వేచ్ఛ, ఆకాశంలో స్వేచ్ఛా విహంగమై ఎగరడమే వాళ్ళకు కావల్సింది. నాకు తెల్సినంతలో, గత ఇరవై ఏళ్ళుగా మోహనరావు తన స్వంత అన్న కుక్కుటేశ్వరరావును పెట్టిన తిప్పలు అన్నీ—ఇన్నీ కావు ఏమాట కామాటే చెప్పుకోవాలి. కుక్కుటేశ్వరానికి మొదట్నుంచీ దేముడూ, దయ్యమూ, పుణ్యమూ పాపమూ ఉన్నాయి. ఆ కారణం చేతనే మోహన్‌రావును పెంచి పెద్దచేసి, ఓ కులమింటికోతిని చూసి అతనికి ముడిపెట్టి, అతన్ని జీవన వ్యాపారంలోకి, బట్టల వ్యాపారంలోకి ప్రవేశపెట్టాడు. మోహన్‌రావు మొదటి రెండు మూడేళ్ళు, మంచిపిల్లవాడిలా, అన్నగారు ఏం చెప్తే అది వింటూ, కాపురం చేసుకుంటూ, ఇద్దరుబిడ్డల తండ్రై నలుగురికీ కావలసిన వాడనిపించుకొని, వ్యాపారాన్ని మూడింతలు చేశాడు.

కుక్కుటేశ్వరరావును చూసిన ప్రతివాళ్ళూ అనే వాళ్ళు "మీకేమండీ, అదృష్టవంతులు. తమ్ముడు చేతికి అందివచ్చాడు. మీరు ఇంట్లోనే కాలుమీద కాలు వేసుకొని తమ్ముడిచేత అవీ—ఇవీ చేయించుకోవచ్చు"

"అంతా భగవంతుడి దయ" అనేవాడు కుక్కుటేశ్వరరావు, పెదిమల మీద గర్వంతో, కళ్ళలో నీళ్ళతో. అయితే వున్నట్టుండి మోహన్‌రావు మారిపోయాడు. ఒక

రోజు ప్రొద్దున్నే అన్నగారి దగ్గరకు వచ్చాడు. "నేను వ్యాపారం మానేస్తున్నాను" అన్నాడు.

"అదేమిట్రా!"

"ఈ జీవితం నాకు చాలా వెగటుగావుంది. వ్యాపారమేమిటో మీరే చూసుకోండి. నేనిక్కణ్ణుంచి వెళ్ళిపోతున్నాను."

కుక్కుటేశ్వరరావుకి అంతా అయోమయంగావుంది. "అమ్మాయీ, పిల్లలూ..."

"ఎవరికెవరు? ఆ అమ్మాయి సంగతీ—పిల్లలు సంగతీ మీరే పట్టించుకోండి"

తమ్ముడికి మతిచెడిందేమో ననుకొని వైద్యుడికోసం పరుగెత్తా డతను తిరిగి వచ్చేసరికి తమ్ముడూ లేడు; క్యాష్ బాక్సులో డబ్బూ లేదు. ఓ చీటీ మాత్రం ఉంది. "జీవితాన్ననుభవించాలని ఉంది నాకు. నా ఆనందానుభవానికి నువడ్డు రాకు"

ఈ వార్తవిని లక్షింందేవి లాంటి అతని భార్య సాటి పేదరాండ్రలో తలవంపులు సైపలేక ఇన్ని ఉమ్మెత గింజలు తిని ఆత్మహత్య చేసుకుంది. తల్లి పోవడంతో "అమ్మా! అమ్మా!" అంటూనే ఎడపిల్ల అమ్మమీద దిగులుతో కన్ను మూసుకుంది. పెద్దపిల్లవాడు ఆర్నెల్లు తిరగకుండానే కలరా వచ్చి నూరేళ్ళ జీవితమూ పూర్తి చేసుకున్నాడు.

మోహన్‌రావుకి సంగతులేవీ తెలియవో, తెలిసీ

పట్టించుకోలేదో, ఆ పోవడం ఆ పోవడం పోవడం మూడేళ్ళ దాకా తిరిగి రాలేదు. డార్జిలింగులో ఉన్నాడనీ, కలకత్తాలో ఎవరో బెంగాలీయువతితో ట్రాములో పోతూ కనిపించాడనీ, ఋషికేష్‌లో సాధువులతో హుక్కా పీలుస్తూ తిరుగుతున్నాడనీ వారూ వీరూ చెప్పుకోవడమే తప్ప, అతని దగ్గర నుంచి ఉత్తరమంటూ ఎవరికీ రాలేదు. అతని బంధువులకు మాత్రం ఒక ప్రశ్న వేధించింది. "ఎంతకాలం అతడిట్లా తెగిన గాలిపటంలా తిరుగుతాడు? ఎత్తుకుపోయిన డబ్బు అయిపోయింతర్వాత ఏం చేస్తాడు?" ఈ ప్రశ్న ఒక శేష ప్రశ్న. ఐతే వాళ్ళను వేధించిన ఇంతసమస్యకూ ఇట్టేసమాధానం దొరికింది. ఉన్నట్టుండి మోహన్‌రావు బెజవాడ చేరుకున్నాడు. మెల్లిగా వాళ్ళతోనూ వీళ్ళతోనూ స్నేహంచేసి ఫ్రీలావ్ సొసైటీ అంటూ ఒకటి స్థాపించి, వాళ్ళ దగ్గరా వీళ్ళ దగ్గరా పదో పరకో చేబదులు తీసుకుంటూ కాలక్షేపం చేస్తున్నాట్ట!

నిజానికి నాకు మోహనరావు అంటే ఒక విధమైన గౌరవం ఉంది. అతను ఎంతటి హేమాహేమీల నయినా నిముషంలో వశవర్తులను చేసుకోగలడు. అతని కళ్ళలో ఆ మన్మథ భావం, అతని పెదిమల్లో ఆ జయదీప్తులు, మొహం నిండా ఓ వింత హాసరేఖ; ముందుకు ఫాలం మీద పడి గాలితో ఆడుకునే ఉంగరాల కుంతలాలు, ఇవేవీ కావు అతనిలో ఆకర్షణలు. ఇంకేదో ఉన్నది. చెప్పడానికి వీలులేనిది, వర్ణించ శక్యం గానిది. అతను మన ఎదుట ఉంటే సాలెగూటి దారాలు మన చుట్టూ పేరుకుంటున్నట్లు.

మోహన్‌రావు దగ్గర మరో రకమైన శక్తి ఉన్నది. అతను కావాలని ఎవరినీ స్నేహం చేసుకోడు. అందరూ అతని సామీప్యాన్ని కోరుకుంటారు. దగ్గరకు వచ్చిన వారిని అతను తనకు వీలయిన పద్ధతిలో వాడుకుంటాడు అతను నోరు తెరచి పది రూపాయలు కావాలని కోరితే కాదన్న వాళ్ళను నేనింత వరకు చూడలేదు. అతను రోజుకు పది రూపాయలు కాదు, కోరితే నిముషానికి పది రూపాయలు ఆ విధంగా సంపాదించాడు. చీట్లాట ఆడేవాడు. విస్కీ తాగేవాడు చీకటి బజార్లో వెల కమ్ముకు పోయే స్త్రీలను కొనుక్కునేవాడు. అతని జీవన సిద్ధాంతం ఒకటే ఉండేది. “నీ భార్యాబిడ్డల కోసం, నీవాళ్ళ కోసం, జీవితావసరాల కోసం నువు ఖర్చు పెట్టే సొమ్మంతా శుద్ధ దండుగ అనుభవించు, ఖర్చు పెట్టు. డబ్బు ఎన్ని సౌఖ్యాలను అమర్చి పెట్టగలదో అన్నీ అమర్చుకో.”

ఈ సౌఖ్యాలను అనుభవించడం కోసమని అతను మళ్ళీ కుక్కుటేశ్వరరావునే ఆశ్రయించాడు. అన్నగారి మీద అతను తన మోహ శక్తులను ప్రయోగించలేదు. అతనికి తెలుసు, కుక్కుటేశ్వరరావు జడభరతుని వంటి మనిషి. అన్నగారికి గౌరవం కావాలి; కుటుంబం పదిమంది వెకిలి నవ్వులకు గురికాకుండా ఉండాలి. దీన్ని అతడు తెలివిగా ఉపయోగించుకున్నాడు.

“అన్నయ్యా! జరిగిందేదో జరిగిపోయింది గత జల

సేతు బంధన మెందుకు?—ఒక్క రెండువేల రూపాయలు ఇయ్యి పట్ట పగలు చుక్కలు ఎట్లా పొడిపిస్తానో చూడు.”

కుక్కుటేశ్వర్రావు తమ్ముణ్ణి నిజంగా నమ్మాడు. నమ్మినందుకు గాను, మోహన్‌రావు మూడు పగళ్లూ మూడు రాత్రిళ్ళూ ఆ డబ్బెట్టి చుక్కలే పూయించాడు. ఓ స్కూటర్ కొని దాంతో నాలుగు వీధులు తిరిగి పురజనులకు ‘ప్రాణమంటే ఎంత తీపో’ రుచి చూపించాడు. ఆ ఊళ్ళో నేడున్న సభారంజని అనే అమ్మాయికి సిలోన్ నెక్లెసు చేయించి పెట్టి, ఆ నెక్లెసును, ఆ మోహనాంగినీ కూడా బజార్లో తన వెంట తిప్పాడు.

ఇదంతా చూసి కుక్కుటేశ్వర్రావుకి తమ్ముడంటే విరక్తి కలిగింది. ఒకళ్ళిద్దర్తో తానూ వాడూ తట్ట తెగలేసుకున్నామనే చెప్పాడు. ఆ మాట విని అన్న మాటల్లో ఉన్న బాధ గమనించి, మోహన్‌రావు ఇలా కుక్కుటేశ్వరాన్ని మామూలు పద్ధతుల్లో గాక, డబ్బుకోసం “బ్లాక్ మెయిల్” చేయడం ప్రారంభించాడు.

“నువ్వు నాకు మూడు రోజుల్లోగా మూడు వందల రూపాయలు ఇయ్యకపోతే, పట్టపగలు తప్పతాగి, కుక్కలా ని ఇంటి ముందు డబ్బిచ్చేవరకు పడివుంటా” ఇదీ ఉత్తరంలో సారాంశం. “అన్నయ్యా! కుటుంబ రహస్యాలు బజారు పాలు చేయడం నాకు ఇష్టం లేదు. నా భార్య ఎందుకు చచ్చిపోయిందో నాకు తెలుసు. ఏదో ఒక తెల్వి లేని సమయంలో నీ ఆశ్రయానికి వదిలిపోయాను కదా అని, ఆ అనాథను

నువ్వట్లా బలవంతం చేయడం నీకు న్యాయంకాదు. పోనీలే! ఇప్పుడెందుకు ఆ సంగతులు నాకు నేను జ్ఞాపకం చేసుకోవడం? నాకు డబ్బు కావాలి. ఇస్తావుకదూ?"

ఈ ఉత్తరాలు చూసి కుక్కుటేశ్వరం విపరీతంగా భయపడి పోయాడు అతనికి పెళ్ళి కావలసిన కూతుళ్ళిద్దరు ఉన్నారు. ఆ సంగతులన్నీ చెప్పుకుని నాతో ఒక రోజు ఆడదాని కన్నా కనాకష్టంగా ఏడ్చాడు. అది చూసి నా హృదయం ద్రవించి పోయింది.

"అతనితో నేను మాట్లాడి చూడనా?"

కుక్కుటేశ్వరం తలవూపాడు. అతని కళ్ళలో ఆశ ఆరిపోతూ వెలుగుతోంది.

"ఈ బ్రతుకు బ్రతకపోతే ఏం?— పెంచిన చేతినే నరకడానికి సిద్ధపడ్డ వాడవు నీవు"

"జల్సా కావాలి. ఆ జల్సాకు డబ్బుండాలి. మా అన్నయ్య దగ్గర డబ్బుంది చచ్చిపోయేటప్పుడు కట్టుకు పోతామా? అయిదు వేలిట్టా పారేయమనండి. ఇహా మళ్లీ కన్పిస్తే ఒట్టు."

నాకిష్టం లేకపోయినా, కుక్కుటేశ్వరం మోహన్ రావుకు అయిదువేలూ ఇచ్చాడు. అన్నట్లుగానే అతనూ తన అన్నకు కన్పించకుండా ఎటో వెళ్ళిపోయాడు.

ఉన్నట్టుండి కుక్కుటేశ్వరానికి ఉత్తరం వచ్చింది.

అందులో ఎవరో బాబూలాల్ చమన్‌లాల్ అనే మార్వాడీ తాను మోహనరావుకు పదివేలు అప్పు పెట్టానని, ఆ పది వేలూ ఇప్పుడు కుక్కుటేశ్వరం గనక వడ్డీతో సహా కట్టక పోతే 'జాయింటు ప్రాపర్టీ' అని, ఆ ప్రాపర్టీ మీద దావా వేస్తాననీ ఉత్తరం రాశాడు.

కుక్కుటేశ్వరానికి తేళ్ళూ జర్రులూ ప్రాకినట్లైంది. "ఏం చెయ్యాలి మాష్టారూ?" అన్నాడు నాతో, కళ్ళ నీళ్ళ పర్యంతమవుతూ.

"ఒక్క కాసి కూడా ఇవ్వవద్దు వాడికి. చూద్దాం ఏం జరుగుతుందో" అన్నాను.

కుక్కుటేశ్వరం నామాట వినలేదు. మోహన్ రావునూ, చమన్‌లాల్‌ని పిలిపించాడు. ఆస్తిపాస్తులన్నీ పంపకం చేసుకుని, మోహన్‌రావు వాటా తాను పదివేలకు కొనుక్కున్నట్లు కాయితం రాయించుకుని, ఆ పదివేలూ బాకీ తీర్చినట్టుగా చమన్‌లాల్‌కిచ్చాడు. అది చూసి మోహన్‌రావు విపరీతంగా నవ్వాడు.

పక్కనే నేనూ ఉన్నాను సాక్షీభూతంగా. నాతో అన్నాడు.

"మా అన్నయ్య, మీరూ తెలివిగల వాళ్ళే సుమండీ! ఆ! చమన్‌లాల్, ఆ దొంగనోటు పాపం మా అన్నయ్యకిచ్చేయ్. నీ వాటా ఎంత?—అయిదువందలా?—తీసుకో; మిగిలిందే నాకు."

ఈ విధంగా ఇరవై సంవత్సరాలనుంచీ జీవితాన్ని

డబ్బులోకి, డబ్బును భౌతిక సుఖాలలోకి మార్చుకుని మోహన్ రావు కాలం గడుపుతున్నాడు. మదవతీ, మద్యమూ అతని జీవితాన్ని ఇరుదండలా నడిపించాయి. మనిషి ఒక అర్థం కాని వచన గీతంలాగా కన్పించేవాడు. మాటలలో, నడకలలో, మనుషుల మనసు దోచుకు మరీ బ్రతికాడు. యాభయ్యో పడి వచ్చినా వాడని మల్లెపువ్వులాంటి ముప్పైయేళ్ళ నవయౌవనం అతని శరీరంలో. అతను వేటగాడని తెలుసు. తెలిసి అతని వేటలో తగుల్కొని ఆనందించారు అందరూనూ. అవసరానికి నా దగ్గరా వంద, రెండు వందలు ఆ మధ్య అప్పు తీసుకున్నాడు. అయినా నాకు బాధలేదు. ఆ డబ్బు తిరిగి రాదని నాకు తెలుసు. అయినా ఒక సంతృప్తి; తెలియని సంతృప్తి. అతని భావాలు నాకు నచ్చవు; అతని రంగుల జీవితం నాకు నచ్చదు; అయినా అతన్ని నేను ద్వేషించలేను.

నాకు కుక్కుటేశ్వరాన్ని చూస్తుంటేనే జాలి వేస్తున్నది. మోహన్ రావు కన్న పది పన్నెండేళ్లు మాత్రమే అతను పెద్ద కానీ అప్పుడే డెబ్బయ్యేళ్ళ ముసలివాడు లాగా అతని నడుం వంగిపోయింది. జుట్టు తెల్లబడి రాలిపోతున్నది. కళ్ళు గుంటలు పడి లోపలికి పీక్కుపోయినాయి. ప్రొద్దున్న ఏడు గంటలు కొట్టేసరికల్లా తన బట్టల కొట్లో ఉండేవాడు. ఒంటి గంటకు కొట్టు దగ్గరికే భోజనం తెప్పించుకునేవాడు. ఏ రాత్రి ఏడింటికో ఇంటికి వెళ్ళడం. అతనిలోని నిజాయితీ అతన్ని కష్టపడేట్లు చేస్తున్నది. అతనికి భార్య సేవచేస్తుంది. కూతుళ్ళు అతను చెప్పిన మాట

వి-టూరు. కొడుకులు వర్తకంలో చేతికి అందివస్తున్నారు. అతను భర్తగా, తండ్రిగా, సంఘంలో వ్యక్తిగా తనబాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తున్నాడు. ఇంకొక అయిదారేళ్ళలో వర్తకమంతా కొడుకుల కప్పగించి, కూతుళ్ళ పెళ్ళిళ్లు చేసేసి, భార్యతో కలసి 'యాత్రా స్పెషల్'లో భారత దేశమంతా తిరిగి వచ్చి, ఆ తర్వాత తన పల్లెటూరికి వెళ్ళిపోయి 'రామకోటి' రాసుకుంటూ జీవితం గడిపేయాలనుకుంటున్నాడు. నన్ను కలుసుకున్నప్పుడల్లా అతను చెప్పేది ఒకటే

“మాష్టారూ! నేను జీవితాన్ని అనుభవించాను. భగవంతుడి సాక్షిగా నా కర్తవ్యాన్ని నేను నిర్వహించాను. నా తమ్ముడు ఉన్నాడు. తిరుగుబోతు; త్రాగుబోతు. నా కన్నా ఒక్కపదేళ్ళు చిన్న. వాడూ బ్రతికాడు, కుక్క బ్రతుకు. చూద్దాం; ఆ భగవంతుడు చివరికి వాడి కెటువంటి శిక్ష విధిస్తాడో!”

న్యాయా న్యాయాలను గూర్చిన ఈ వివరణం నాకంతగా మనసు కెక్కదు. జీవితం పుస్తకాల్లో చెప్పినట్టుగా ఉండడం లేదు మరి!

ఇప్పుడు కుక్కుటేశ్వరంతో హోటలు గదిలో కూచుని, బాధతో, జీవన భారంతో వరుగైన కుక్కుటేశ్వరాన్ని చూస్తుంటే నాకు జాలి వేస్తున్నది. మోహనరావు మళ్ళీ భరింపరాని ఏదో అపరాధం చేసి ఉంటాడు. అదే అతని వ్యథను ద్విగుణీకృతం చేస్తున్నది.

"ఇప్పుడేం జరిగిందో నీకు తెలుసా?"

కుక్కుటేశ్వరం ఏం చెప్పినా వినటానికి సిద్ధంగా ఉన్నాను "మోహన్‌రావుని బహుశా జైల్లో పెట్టి ఉంటారు. లేకపోతే అతన్ని ఎవరో హత్యో అన్నా చేసి వుండాలి" అనుకున్నాను

"జీవితమంతా కష్టపడ్డాను చెమట కాదు, నెత్తు రోడ్చి ప్రతీ నయాపైసా కూడబెట్టాను ఎప్పుడూ అబద్ధం చెప్పిగానీ. అన్యాయంగా ఒకళ్ళ ఉసురు పోసుకునిగాని, ఊహూం ఎరగను. న్యాయంగా, ధర్మంగా బ్రతికి, వృద్ధాప్యంలో ఈ రెండూ నాకు అక్కరకు రాగా ప్రశాంతంగా కళ్ళు మూద్దామనుకున్నాను. ఇప్పుడు తెలిసింది. లేవు, న్యాయం ధర్మం అనేవి లేవు. భగవంతుడు గ్రుడ్డివాడు."

"నిజం!" నేను తలాడించాను

"మీరు ఒప్పుకోరా మాష్టారూ! వాడు, వాడు, నా తమ్ముడు, మోహాన్‌రావు, ఉత్త దగుల్బాజీ జీవితం గడి పాడు. భగవంతుడే ఉంటే, వాడు రౌరవ నరకాలకు పోవాలి."

"నిజమే!" మళ్ళీ తలాడించాను.

కుక్కుటేశ్వరం కోపంతో పిడికిళ్ళు బిగించాడు. కళ్ళు చింత నిప్పులా అయినాయి. "వాడిప్పుడు లక్షాధికారి మాష్టారూ! మరి ఎప్పట్నుంచి సంబంధం వుందో ఏమో, ఓ వెధవ ముండ, ముందు వెనకా ఎవరూ లేని ఓ అనాధ, పోతూ పోతూ, దానికి మొగుడిచ్చిన ఆ స్తినంతా ఈముండ

పేర రాసి చచ్చిపోయింది. యాభయ్యెకరాలు నిక్షేపం లాంటి పల్లపు పొలం, బ్యాంకులో లెక్కలేనంత క్యాష్, ఓహ్."

ఆ కోపంలో ఆయన కాఫీ బట్టల మీద పోసుకున్నాడు.

"న్యాయంకాదు; అటువంటి వాళ్ళకు దేవుడు చేయవలసింది ఇట్లాకాదు. ఇదికాదు పరిపాలన అంటే..."

"నే నీ విషయంలో నిస్సహాయుణ్ణి. భగవంతుడికి సలహా చెప్పలేను గదా! జరిగినది తల్చుకుంటే నాలో నవ్వు పొంగుతున్నది. మనమెంత అజ్ఞానులమో తెలిసి మరీ మరీ నవ్వు వస్తున్నది. నాకు తెలుసు. హోటలు బిల్లు నేనేచెల్లించినా, కుక్కుటేశ్వరం నా నవ్వు చూసి నన్ని జన్మలో క్షమించడు. అయితే నాకేం?—మోహన్ రావు, నేనూ ఇప్పుడు నెచ్చెలులం. కావలసినప్పుడు పదో పరకో నేనే అతన్నడిగి తీసుకుంటున్నాను. ఇందులో తప్పేమున్నది? ఉన్నవాళ్ళ దగ్గర డబ్బున్నది లేనివాళ్ళకు ఈయడం కోసమే గదా!